## నెంబర్ 1947 సంతోషాబాద్ పాసింజెరు

కంపార్టుమెంటు ద్వారం దగ్గిరి కెప్పుడొచ్చానో నాకు తెలియదు. నేనే కదిలానో, లేకపోతే వెనక వాళ్ళు తోయడంతో ముందుకొచ్చి, యీ కంపార్టుమెంటులోకి పడ్డానో, నాకు తెలియదు. కూచోడానికి స్థలం కోసం వెతుక్కుంటూ వుండగానే గార్డ్ వేసిన విజిల్ వినిపించింది. రైలు భీకరంగా ఫీంకరించింది. ముందుకూ వెనక్కూ వూయల్లా కాస్సేపు వూగి, వెనక్కే వెళ్లిపోతుందేమోనని ప్రయాణీకులందరూ కంగారు పడిపోయేటంత వరకూ వెనక్కే నడచి, ఆ తర్వాత చిత్ర విచిత్రమైన సవ్వడులు వెలిగక్కుతూ, మెల్లగా, బరువుగా, ముందుకు కదిలింది రైలు. ఆత్రుతతో జేబులోకి చేయి పెట్టి చూశాను. పర్వాలేదు. యింటర్వ్యూ కాగితం పదిలంగానే వుంది.

వోసారి బిగ్గరగా నిట్టూరుస్తూ కంపార్టుమెంటంతా కలయ జూశాను. సంతోషాబాద్‌లో అమ్ముకోవడం కోసం గంపలనిండుకూ కాయగూరలనూ, తమలపాకులనూ మోసుకొచ్చిన నడి వయసు ఆడవాళ్లు, రైలు పెట్టెలో తమ కెక్కడా స్థలం దొరక్కపోవడంతో గేటు దగ్గరే బైటాయించేశారు. యీ రాజ్యమంతా తమదే నన్నంత ధీమాతో, యెక్కే వాళ్లని యెక్కని వ్వకుండా, దిగేవాళ్లను దిగనివ్వకుండా వాళ్లు కారు బారు చేస్తున్నారు.

గేటు దగ్గర, ఆ ఆడవాళ్లకూ, వాళ్ల గంపలకూ మధ్యలో రకరకాల విన్యాసాలతో నిల్చున్న కుర్రాళ్లని చూడగానే కాలేజీ కుర్రాళ్లని తెలిసిపోతోంది. రైలు వేగం అందుకున్న తర్వాత గూడా, వాళ్లు కమ్ముల్ని పట్టుకుని వేలాడుతూ, సంతోషాబాద్‌లో తాము చూడబోయే మాట్నీ సినిమా గురించి

ముచ్చటించుకుంటున్నారు.

నా దురదృష్టం కొద్దీ నేనెక్కిన కంపార్టుమెంటులోని సగభాగాన్ని రైల్వే మెయిల్ సర్వీస్ డిపార్టుమెంటు వాళ్లు ఆక్రమించుకునేశారు. మిగిలిన ఆ కాస్త స్థలంలోనూ, నాలుగు వరసల సీట్లు మాత్రమే మిగిలాయి. రెండేసి వరసల కొక గదిలా ఆ స్థలాన్ని రెండుభాగాలుగా విభజించారు.

ద్వారం దగ్గరి లావెట్రీ తలుపు తెరుచుకునే వుంది. గోడ పక్కన నక్కిన దొంగల్లా అందులో రెండు కట్టెల మోపులు గుసగుసలాడుకుంటున్నాయి. వాటిని మోసుకొచ్చిన మురికి గుడ్డల, చింపిరి జుట్ల, నల్ల శరీరాల, యెముకల ప్రోగుల మనుషులిద్దరూ అక్కడే నిలబడి బీడీలు కాల్చుకుంటున్నారు. విరిగిన తలుపులాంటి మొగవాడొకడూ, సగం కాలిన కట్టెపేడులాంటి స్త్రీ వొకతే, నొక్కులు పడ్డ సత్తుగిన్నెల్లాంటి పిల్లలిద్దరూ, పాత గోతం మూటలో తమ సంసారాన్నంతా సర్దుకున్న బిక్షగాళ్ల కుటుంబ మొకటి అవతలి వైపు డోర్ దగ్గర తిష్ట వేసేసింది. వాళ్ల పక్కన, లావెట్రీ తలుపుల వెనకాల కూర్చున్న వ్యక్తి మొండి చేతులూ, వికృతంగా మారిన ముఖమూ, కుష్టువ్యాధిపైన జనాల కుండే భయాన్నీ జుగుప్సనూ పెంచుతున్నాయి.

ఆలస్యంగా లోపలికి జొరబడి వచ్చిన వాళ్లెవరో మళ్లీవోసారి తోయడంతో ముందుకు విసురుకుపోయాను.

వొక్కసారిగా నేనేదో వింత ప్రపంచంలోకి వచ్చి పడ్డట్టయింది. కాకులు దూరని కారడువుల్లోనూ, చీమలు దూరని చిట్టడువుల్లోనూ జంతుజాలాల్లా నివసించే ఆటవికులూ, యెడారుల్లోని బిడారు వర్తకుల్ని దోచుకునే అనాగరిక తండాలూ నాకు జ్ఞాపకం వచ్చాయి. కాలం వొక్కసారిగా వేల సంవత్సరాల వెనక్కు పరిగెత్తినట్టయింది. యేయే రంగుల్ని యేయే పాళ్లల్లో కలిపితే వాళ్లు తొడుక్కున్న బట్టల రంగు వుద్భవిస్తుందో చెప్పగలిగే చిత్రకారుడు యీ ప్రపంచంలో వుండడు. వాళ్ల తలల్ని చూడగానే అట్టలు గట్టుకుపోయిన బూరగ పత్తీ. చీకి పారేసిన తాటిముట్టెలూ గుర్తు కొస్తున్నాయి. పాలు తాగే పిల్లాడినుంచీ, నడుంవిరిగిన ముసలాడి వరకూ అన్ని రకాల మనుషులూ వున్నారక్కడ. ఆడవాళ్లల్లో నాజూకుతనమూ, మగవాళ్లల్లో హుందాతనమూ మచ్చుకైనా కనిపించడం లేదు. దారి పక్కన అమ్ముతున్న యే తినుబండారాన్నీ వాళ్లు వదలి పెట్టినట్టు లేదు. చెత్తాచెదారాలతో వాళ్లు తమ బెంచీలనే కుప్ప తొట్లలా తయారు చేసేశారు. వాళ్లపై నున్న బెర్త్‌ల్లో సైతం రకరకాల సామాన్లమధ్యలో

కొన్నిశాల్తీలు కొలువుదీరి వున్నాయి. అక్కడెక్కడా చీమ దూరే స్థలమైనా లేదు. చిత్ర విచిత్రమైన అరుపులతో వాళ్లక్కడొక తుపాను సృష్టిస్తున్నారు.

"ముందుకెళ్లకుండా అక్కడ ఆగి పోయిందెవరు? యిక్కడ మేము పుటబోర్డ్‌పైన అంతర్మధ్యంలో వేలాడాల్సిందేనా?" అంటూ యెవరో గేటుదగ్గర అరుస్తున్నారు. యెవరో మళ్లీ నన్ను ముందుకు నెట్టారు.

అవతలి వైపు నుంచీ యివతలి సీట్ల వైపుకొచ్చేసరికి పూర్తిగా మరో లోకంలోకి అడుగుపెట్టినట్టయింది నాకు. కిటికీపక్క కూర్చున్న యువతి ముఖంలో ఆమె చదువుతున్న నవలలోని పాత్రల అనవసరపు అపార్థాల క్రీనీడలు తారట్లాడుతున్నాయి. ఆమెపక్కన కూర్చున్న యువకుడు - బహుశా ఆమె భర్తయి వుంటాడు-యెర్రంచు డిటెక్టివ్ పుస్తకంలో హంతకుడి కోసం గాలిస్తున్నాడు. వాళ్లకెదుటి బెంచీపైన గాటయిన పొగచుట్ట తగలేస్తున్న ఖద్దరువస్త్రధారికీ, క్రికెట్టురాజకీయాలు చర్చిస్తున్న యువకులిద్దరికీ మధ్యలో, వొక లావుపాటి శాల్తీ వీలయినంత యెక్కువ స్థలాన్ని ఆక్రమించుకుంటూ పడుకుని వున్నాడు. అతడు తొడుక్కున్న బంగారుగొలుసు మిలమిల మెరుస్తూ కనిపిస్తోంది.

బయట సూర్యుడు నిప్పులగుండంలా మండిపడుతున్నాడు. అందులోకి విసిరేసిన యినప కమ్మీలా రైలు రైలంతా వేడెక్కి కమలుతోంది. వేగం కంటే శబ్దాన్నే యెక్కువగా వుత్పత్తి చేస్తోంది రైలు. కంపార్టుమెంటు పైనున్న తుప్పుపట్టిన ఫాన్లు లోపలి జనానికి తగినంత గాలిని సరఫరా చేయలేక, చాలాకాలం కిందటే పరాజయాన్ని వొప్పుకున్నాయి. యెప్పుడు, యెలా, యెందుకు బయల్దేరామన్న సందేహాలేవీ ప్రయాణికుల కున్నట్టు లేవు.

అంతవరకూ గేటు దగ్గరే వుండి పోయిన కుర్రాళ్లకు కొందరికి కూర్చుందా మని అనిపించినట్టుంది. యివతలి వైపు బెంచీల దగ్గరకొచ్చి, పడుకుని నిద్రపోతున్న సిల్కు చొక్కా వ్యక్తిని లేపబోయారు.

పొగచుట్టలో పరమాత్మను సందర్శిస్తున్న ఖద్దరువాలా కంగారుపడుతూ "ఆగండిబాబూ! ఆగండి" అంటూ ఆదుర్దాగా వారించాడు.

కుర్రాళ్లు అతని వంక ప్రశ్నార్థకంగా చూశారు.

"ఆయనగారు ఫుల్‌టికెట్టు కొనుక్కున్నాడట! అందువల్ల ఆ బెంచీపైన ఫుల్ రైట్సన్నీ ఆయనవేనట! నిద్రరాకపోయినా పడుకుంటాడే గానీ లేచి కూచోడట! తేనె తెట్టెను కదపడం మంచిది గాదు. అనుభవంతో చెప్తున్నాను.

యీ విషయంపైన పోయిన స్టేషనులో పెద్దయుద్ధమే జరిగింది. యీయనగారితో పోట్లాటకుదిగినమనిషిని బలవంతంగా విడదీసి వేరే పెట్టెలోకి యెక్కించే సరికి తలప్రాణం తోకకొచ్చింది" అన్నాడతను.

"పర్వాలేదులే పెద్దాయినా! యిలాంటి మొండిగటాలు మాకు కొత్తగాదు. మాకీ ప్రయాణమూ తప్పదు. యిలాంటి జగమొండి మనుషులతో గొడవపడడమూ తప్పదు. మేం మాత్రం టికెట్టు కొనలేదనా ఆయనగారి వుద్దేశం. యెలా లేవడో అదీ చూస్తాం" అంటూ వో కుర్రాడు సిల్కుచొక్కావ్యక్తి రెండు చేతులూ పట్టుకుని బలవంతంగా లేపి కూచో బెట్టాడు. మరోకుర్రాడు బట్టలమూటను యెత్తి కుదేసినట్టుగా అతడి శరీరాన్ని వో పక్కకు దిగతోశాడు. యింకో యువకుడు అతడి కనురెప్పల్ని బలవంతంగా' వూడదీశాడు.

మొదట ఆ సిల్కువస్త్రధారి ముఖం కోపంతో కందగడ్డలా తయారైంది. అదో రకం వింతజంత్రసమ్మేళనంలా అతడి పళ్లు పటపటలాడాయి. అయితే యెదురుగా యమకింకరులలాంటి యువకులు కనిపించగానే అతడు మరేమీ చేయలేని అశక్తతతో నీరు గారి పోయాడు.

"గురువుగారు శవాసనం వేయదలచుకుంటే బెంచీకింద, సామాన్లమధ్యలో సర్దుకోవచ్చు! మాకేం అభ్యంతరం లేదు" అంటూ జులపాల యువకుడొకడు క్రేంకారం చేశాడు.

తనకోపాన్ని ప్రకటించడానికి అనువైన స్థలం గాకపోవడంతో శివమెత్తిన గణాచారిలా వూగిపోతూ అతను తన సూట్‌కేసును చేతికెత్తుకుని, "నెక్స్ట్ స్టేషనులో రైల్వే పోలీసులకు రిపోర్టిచ్చి, మీ పని పట్టకపోతే నాపేరు మార్చేయండి" అని గాండ్రిస్తూ గేటు దగ్గరికి వెళ్లిపోయాడు.

ఆ చోటులో ఆ ముగ్గురు కుర్రాళ్లూ సర్దుకుని, నాకూ కాస్త చోటు ప్రసాదించారు.

అంతవరకూ డిటెక్టివ్‌నవలలో మునిగిపోయిన కళ్లద్దాలయువకుడు, "కంగ్రాచ్యు లేషన్స్... మంచి పని చేశారు... థాంక్యూ" అంటూ కుర్రాళ్ళను ప్రశంసించాడు. అతడి భార్యామణి కూడా నవల పేజీల సందుల్లోంచీ వొక చిరునవ్వును వారి వైపుకు విసిరింది.

అయాచితంగా లభించిన అభినందనలకు పొంగిపోతూ గిరజాల యువకుడు, "ఆ చొక్కా, ఆ మైనరు గొలుసూ, చూడ్డానికి పెద్ద షావుకారు ఫోజుంది గదా! ఫస్టు క్లాసులో వస్తే సొమ్మేమైనా పోతుందా?" అని యెద్దేవా

చేశాడు.

"యీ పాసింజెరు రైల్లో ఫస్ట్‌క్లాసు గూడా వుందా?" అని అడిగాడు కళ్లజోడు యువకుడు ఆశ్చర్యపడుతూ.

"రెండు పెద్ద ఫస్టుక్లాసు పెట్టెలున్నాయి. రైల్వే ఆఫీసర్లకంతా ఫస్టుక్లాసు ఫ్రీ గదా! వాళ్లకే చాలదు అది. ఆపైన పొలిటికల్ లీడర్లు వుండనే వుంటారు. పాపం యెన్నికలప్పుడు మన మురికి కొంపల చుట్టూ, యిరుకు రోడ్ల చుట్టూ తిరిగి తిరిగీ అలసిపోయి వుంటారు. యిప్పుడైనా ఫస్టు క్లాసులో విశ్రాంతి తీసుకోనివ్వండి వాళ్లను" అన్నాడు బొమ్మల చొక్కా కుర్రాడు.

మరో కుర్రాడు వంతపాడుతున్నట్టుగా వెంటనే అందుకుని "మూడోతరగతి పేరుకైతే తీసేశారు గానీ మూడోతరగతి మనుషులని తరమలేరు గదా! ప్రతి పెట్టె గేట్ల దగ్గరా, లావెట్రీల దగ్గరా, పెంటకుప్పలపైనా యీగల్లా ముసురుకున్న మనుషులంతా వాళ్లే!" అన్నాడు.

"యీ పాసింజెరురైల్లో ఫస్టుక్లాసు కూడా కిటకిటలాడుతూనే వుంటుంది. సౌకర్యాలు అంతంత మాత్రమే! వచ్చే స్టేషన్లో యేదైనా క్రాసింగుంటే, దిగేసి యెక్స్‌ప్రెస్ యెక్కేస్తాను" అంటూ బిగ్గరగా నిట్టూర్చాడు ఖద్దరువాలా.

"ఆ స్టేషన్లో యెక్స్‌ప్రెస్ టికెట్లు అమ్మరండీ!" అన్నాడో కుర్రాడు.

"యీ రైల్లో వెళ్లే టీసీలు చాలా మంది నాకు తెలిసిన వాళ్లే!" అంటూ కళ్లెగరేశాడు ఖద్దరు వాలా.

యింతలో పక్క బెంచీల దగ్గర పెద్దగగ్గోలు చెలరేగింది. కంఠాలు లౌడ్‌స్పీకర్లై మోగినట్లు, హావ భావాలు బాంబుల్లాపేలినట్టూ అనిపించసాగాయి. కళ్లజోడు యువకుడూ, అతడి భార్యా కంగారు పడుతూ అటువైపుకు తొంగి చూశారు.

"మరేం పరవాలేదు సార్! మా ఫ్రెండెవరో వాళ్లకు క్రమశిక్షణ నేర్పిస్తున్నట్టున్నాడు" అంటూ పెద్దగా నవ్వేశాడు బొమ్మలచొక్కా కుర్రాడు. "యిది మాకు కొత్తగాదు లెండి! యీ గుంపుతో మాకీ కొట్లాటలు అలవాటే! యింకెక్కడా స్థలం దొరకనట్టు సంతోషాబాద్‌లో గుడి కట్టుకున్నాడు గదా దేవుడొకడు! ఆయన గారిని చూడ్డమే తమ పరమావధయినట్టు అన్ని రకాల మనుషులూ వస్తుంటారు. వాళ్ల భాషలు మాకు అర్థం గాదు. కొందరు డబ్బా రేకులపైన రాళ్లు దొర్లించినట్టు డబడబ లాడతారు. యింకొందరు మాట్లాడుతూంటే మూల్గుతున్నట్టు వుంటుంది. గుంపులు గుంపులుగా వీళ్లు

తలావొక పెట్టెలోకి దూరేసి, వేరేవాళ్లని లోపలికి రానివ్వకుండా తలుపులు బిడాయించేస్తారు. కంపార్టుమెంటంతా తమ సామ్రాజ్యమేనని గోలపెడతారు. పొరబాటున గానీ, తప్పనిసరి పరిస్థితుల్లో గానీ వేరే వాళ్లు లోపలికి అడుగు పెడితే చాలు, యిలా ప్రపంచయుద్ధం సృష్టిస్తారు"

మాట్లాడుతున్న వాడల్లా కాస్సేపాగి టెలిపతీ ద్వారా తనకేదో సందేశమందినట్టుగా తల వూపుతూ, "చైనెవరో లాగేశారు" అంటూ లేచి, చేపల ముక్కల్లోంచీ దూసుకెళ్లే జంబు తీగలా అతను జనం మధ్యలో దారి చేసుకుంటూ డోర్ దగ్గరికి పరిగెత్తాడు.

కిటికీదగ్గర కూర్చున్న కుర్రాడు బయటకి తొంగిచూసి 'అవునవును స్పీడ్ తగ్గిపోయింది' అంటూ తానూ అతణ్ణి అనుసరించాడు. వొకరి వెంట వొకరుగా కుర్రాళ్లందరూ డోర్ దగ్గరికి వెళ్లిపోయాక నేను కిటికీ దగ్గరికి జారుకున్నాను.

రెండుమూడు నిముషాలసేపు పరిగెత్తడానికి ప్రయత్నించి విఫలమై, జావగారిపోయి, చివరకు నిస్పృహాయురాలై నిలచిపోయింది రైలు.

రైలలా హఠాత్తుగా ఆగిపోవడానికి కారణం తెలుసుకోవడం కోసం వుత్సాహవంతులైన ప్రయాణీకులు కొందరు అప్పటికే బయటికి దుమికేశారు. చుట్టూ కనుచూపు మేరలో ఆకుపచ్చరంగెక్కడా కనిపించడం లేదు. యెర్రటి బంజరునేలల కవతల కాఠిన్యం పోతబోసినట్టుగా బండరాళ్ల గుట్టలు కనిపిస్తున్నాయి. ఆగిన రైలు చుట్టూ చచ్చిన పాము చుట్టూ చేరే చీమల్లా ప్రయాణీకులు గుమిగూడిపోయారు.

"యేం జరిగింది?" అంటూ కళ్లద్దాల యువకుడు తుపాకీ పేల్చినట్టుగా అడిగాడు. యెవరూ సమాధానం చెప్పకపోవడంతో మరింతగా మండిపడుతూ. "ఛీ ఛీ.... యీ మనుషుల్లో రోజురోజుకూ డిసిప్లెయిన్ తగ్గిపోతోంది. యిలా అరగంటకోసారి చైను లాగుతూ పోతే, పట్టించుకునే నాధుడే లేడా?" అని గీపెట్టాడు.

"కొండకవతలేదో వూరున్నట్టుంది. రైలిక్కడ ఆగదు. కానీ ఆ వూళ్ళోని వాళ్లెవరో యీ రైల్లో వస్తున్నట్టున్నారు. బహుశా వాళ్లే చైను లాగి వుంటారు..." అన్నాను నేను తటపటాయిస్తూనే.

"యిలా అనవసరంగా చైను లాగితే పనిష్మెంటేమిటో తెలియదా మీకు? ఆ చైను కింద అంతంతేసి అక్షరాలతో రాసిన నోటీసును మీరెప్పుడూ చూడలేదా?"

అతడి కోపం నా వైపుకు మళ్ళినందుకు విస్తుపోక తప్పలేదు.

"లాగిన వాళ్లెవరో తెలిస్తే గదా పనిష్మెంటు! కంపార్టుమెంటు లోని వాళ్లంతా యెవరికి వాళ్ళే తమకు సంబంధించిన విషయం గాదన్నట్టుగా వుండి పోతారు. యీ సందులో అసలు వ్యక్తి జారుకుంటాడు. మీకు పిల్లిమెడలో గంట కట్టాలనుకున్న యెలుకల కథ తెలుసు గదా! యీ వ్యవహారం కూడా చివరికంతే!" అన్నాను.

"డ్రైవరు వాక్యూం కట్ చేస్తే చాలు! చైను లాగినా రైలాగదు" అన్నాడు కళ్ళ జోడు యువకుడు కసిగా.

"ఆ పని డ్రైవరోసారి చేశాడు. అప్పుడు నిజంగానే యెవరికో ప్రాణాలపై కొచ్చి పడింది. గొలుసులాగినా రైలాగలేదు. తరువాతి స్టేషన్లో డ్రైవరు పైన కంప్లయింటిచ్చారు. డ్రైవరు నెత్తీ నోరూ మొత్తుకున్నాడు" అన్నాడు పక్కన కూర్చున్న కుర్రాడు.

కళ్లజోడు యువకుడి ముఖం ముడుచుకుపోయింది. చేతిలోని పుస్తకాల్ని విసుగ్గా సూట్‌కేసులోకి దూర్చేసి, సిగరెట్టుపెట్టెను పైకి లాగాడు. నిముషం తర్వాత అతడి పెదవులమధ్య జానెడు పొడవున్న సిగరెట్టు పొగల్ని విరజిమ్మసాగింది.

నాకెందుకో అతణ్ణి యిరకాటంలో పెట్టాలని అనిపించింది.

"మీరు చైనుకిందున్న నోటీసును చూశారుగానీ, యిటువైపున్న నోటీసును గమనించినట్టు లేరు" అంటూ అతడికి కుడివైపు కిటికీపైనున్న నోటీసును చూపెట్టాను.

'పొగ త్రాగరాదు' అన్న అక్షరాలు యెర్రటి రంగులో హెచ్చరిస్తున్నాయి. ఆ ప్రకటనను చూడగానే, చేయి తగలగానే ముడుచుకునే అత్తిపత్తి రెమ్మలా, కళ్లజోడు యువకుడిముఖం కుంచించుకుపోయింది. వెంటనే అతడు అప్పుడే వెలిగించిన సిగరెట్టును బూటు కాలికింద పడేసి, నలిపేశాడు. మరింతగా ముఖం మాడ్చుకుంటూ వొంగి, సిగరెట్టు పీకను పైకెత్తి కిటికీలోంచి బయటికి విసిరేశాడు.

అంతవరకూ నవలాపఠనంలో నిమగ్నురాలైవుండి పోయిన అతని భార్య తల పైకెత్తి ఆశ్చర్యపడుతూ మా యిద్దరి ముఖాల కేసి మార్చి మార్చీ చూడసాగింది. అయిదు నిముషాల తర్వాత అతను పెదవి కదిపాడు. "దాదాపు గంట నుంచీ పక్కన కూర్చున్న ఆ పెద్దమనిషి చుట్ట తగలేస్తున్నాడు. అప్పుడు లేని అభ్యంతరం తీరా నేను సిగరెట్టు వెలిగించాక వచ్చిందా?"

నాకేమని సమాధానం చెప్పాలో తోచలేదు.

మళ్ళీ అతనే కొనసాగించాడు. "మీ అందరి సంగతీ నాకు బాగా తెలుసు. సభ్యతా సంస్కారాలు వుండే వాడు దొరికితే వాణ్ణి కోతిలా ఆడించాలనుకుంటారు. అదే యెవరైనా మొండి మనిషి కనబడితే అంత దూరంలోనే తప్పుకుంటారు..."

"అదేంటయ్యో! నన్ను మొండి మనిషంటావేంది? వొళ్లు చిమచిమలాడుతోందా?" అంటూ ఖద్దరువాలా విరుచుకు పడ్డాడు.

యీ అనుకోని పరిణామానికి విస్తుపోతూ కళ్లజోడు యువకుడి భార్య "దారిన బోయే గొడవలన్నీ మీ కెందుకు? కాస్సేపు గప్‌చుప్‌గా కూర్చోలేరా? మీతో నాకు పెద్ద తలనొప్పయి పోతోంది" అని కసురుకొంది. యింతలో రైలు పెద్దగా ఆవులించింది.

రైలు కాస్సేపు ముందుకూ, కాస్సేపు వెనక్కూ నడచింది. కిందికి దిగిన వాళ్లంతా తాపీగా రైల్లోకి యెక్కి గేటు దగ్గరి కమ్ముల్ని పట్టుకుని వేలాడసాగారు. మనుషులనే యినప రజను నతికించుకున్న రైలనే అయస్కాంతం బరువుగా ముందుకు కదిలింది.

గొలుసు లాగినప్పుడు అవతలికెళ్ళిన కుర్రాళ్లలో యిద్దరు మాత్రం బుడ్డీ దీపపు వెలుతుర్లో తారట్లాడే నీడల్లా శబ్దం చేయకుండా వచ్చి నా పక్కన కూర్చున్నారు. యెలిమెంటరీ స్కూల్లో నోటిబీగాలు వేసుకుని కూర్చునే పిల్లల్లా సంజ్ఞలతోనే మాట్లాడుకోసాగారు.

నేను అనుమానంగా చూస్తూ "మిగిలిన వాళ్లెక్కడ?" అని అడిగాను.

వాళ్లు "టీసీ... టీసీ" అంటూ కోడ్ భాషలో సమాధానం చెప్పారు.

ఆ భాషకు అర్థమేమిటో నాకు తెలియక మునుపే, అవతలి బెంచీల దగ్గర అలజడి మొదలయింది.

అయిదు నిముషాల తర్వాత, తెల్లటి చెమట డాగుల నల్లటి కోటు తొడుక్కున్న టీసీ, తనకంటే పొడుగ్గా వున్న యువకుడి నొకణ్ణి మెడబట్టి నెట్టుకుంటూ, మా ముందుకొచ్చేశాడు. "రాస్కేల్! నా చేతిలోంచీ తప్పించుకుందామనుకుంటున్నావా? అది నీ యబ్బ తరంగాదు. టికెట్టడిగితే మొరాయించి చూస్తావేమిటి? నన్ను మింగేస్తావా యేమైనానా? రోజుకు నీలాంటి వాళ్లను సవాలక్షమందిని చూస్తా వుంటాను. నా పైన్నే తిరగబడతావా? దొంగనాయాలా! మిమ్మల్నంతా జైల్లోకి తోయకపోతే అప్పుడడుగు నన్ను!

టీసీలంటే అంత తేలికైపోయామా? యిక్కడే నిలబడు. కదిలావంటే చంపేస్తాను. ఆ పక్క టికెట్లు చెక్ చేసి వస్తాను. అప్పుడు తేలుస్తాను నీ సంగతి..." అంటూ ఆ నల్లటి యువకుణ్ణి మా ముందుకు నెట్టేసి అవతలి వైపుకు వెళ్లిపోయాడు.

బోనులో చిక్కుకున్న యెలుకపిల్లలా బిక్కు బిక్కుమంటూ నిలబడిపోయాడా వ్యక్తి. అతడి వయసింకా పాతికేళ్లకు చేరి వుండదు. నల్లగా చేవబారిన శరీరం. మొరటైన అవయవాలు. చూడగానే వ్యవసాయం చేస్తున్నట్టుగా తెలిసిపోతున్న వైఖరి.

"చూడండి. మనిషెంత బాగున్నాడో! వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌లా లేడూ! టికెట్టు కొనడానికి డబ్బుల్లేకపోతే రైలెందుకు యెక్కాలి? యిలాంటివాళ్ల వల్లే మన ప్రయాణాలిలా తగలబడుతున్నాయి. వీళ్లనిలాగే అంతర్మధ్యంలో దిగతోసేయాలి" కళ్ళజోడు యువకుడు ఆవేశపడిపోసాగాడు.

"మళ్ళీ మొదలుపెట్టారా మీరు! అబ్బబ్బా! దారిన పోయే తగవులన్నీ మీకే కావాలా? మీరలా నోటికొచ్చినట్టల్లా మాట్లాడుతూంటే అతను తిరగబడ్డాడే అనుకోండి. అప్పుడేం చేస్తారు?" అతడి భార్య విసుక్కొంది.

"యేమిటీ, తిరగబడ్డమా? నా కంటే బలంగా వున్నాడనా? నీకు తెలియదు నా సంగతి! నా క్లీన్ కాన్సెస్‌నెష్ ముందు వాడి భుజ బలమెంత?" అతను పిడికిళ్లు బిగిస్తూ కళ్లురిమి చూడసాగాడు.

"మిమ్మల్ని వుపన్యాసం దంచమన్లేదు. మౌనంగా కూర్చోమన్నాను" అందామె కోపంగా.

రైలువేగం నెమ్మదిగా తగ్గింది. బ్రేకులు రొదపెడుతూ చక్రాల్ని అదుముతున్న శబ్దం కర్ణకఠోరంగా వినబడుతోంది. రెండే ట్రాకులున్న స్టేషనులోకి తక్కుతూ తారుతూ ప్రవేశించింది రైలు.

"యెక్స్‌ప్రెస్ రాబోతోంది. యిక్కడ క్రాసింగు. అందుకే లూప్ లైన్‌లో కొచ్చింది మన పాసింజెర్" అన్నాడు గిరజాల కుర్రాడు. అతడి పక్కన కూర్చున్న బొమ్మల చొక్కా కుర్రాడు "ఆ యెక్స్‌ప్రెస్ యెప్పుడొస్తుందో యేమో! అసలు అవుటయిందో లేదో... యిక్కడెంతసేపు పడిగాపులు పడాలో! మనమూ దిగుదాం కాస్సేపు...' అంటూ కిందికి దిగి పోయాడు తన నేస్తాలతో సహా.

పాడవాటి మట్టి ప్లాట్‌ఫాం పక్కన ఆకులు రాలిన చెట్లు కొన్ని నిర్లిప్తంగా నిలబడి వున్నాయి. పాడుబడిన చిన్నషెల్టరు పైన 'కాంటీను' అన్న యింగ్లీషు

అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. యింగ్లీషు వాళ్లు కట్టిపోయిన పాతరాతి కట్టడంలోంచీ నలిగిన దుస్తుల స్టేషను మాస్టరు రంగు వెలిసిన జండాల్ని చేతబట్టుకుని, నిద్రలో నడుస్తున్నట్టుగా బయటికొస్తున్నాడు. పాత గుమ్మజ్‌ల లాంటి క్వార్టర్సులు కొన్నితప్ప చుట్టూ యెక్కడా యిండ్లు లేవు. స్టేషన్ ధాటికి భయపడి, వూరు దూరంగా పారిపోయినట్టుంది. యీ అంతర్మధ్యంలో స్టేషను నెందుకు కట్టారో బోధపడడం లేదు.పాత డబ్బాల్లో రకరకాల తినుబండారాల్ని అమ్ముకుంటూ చిరుగుల బట్టల పసివాళ్లూ, మాసిన దుస్తుల బడుగు స్త్రీలూ రైలు చుట్టూ గిరికీలు కొట్టసాగారు. ఆకలిని తట్టుకోలేని ప్రయాణీకులు దొరికినదాన్నల్లా కొని తినసాగారు. స్టేషను ముందున్న యేకైక నీటి కొళాయి చుట్టూ పెద్ద గుంపు చేరిపోయింది.

"పోయిన జంక్షను దాకా సూపర్ యెక్స్‌ప్రెస్‌లో వచ్చాను. యెంత కంఫర్టబుల్ జర్నీనో తెలుసా? మన ఫస్టుక్లాసు దాని సెకండ్‌క్లాసు ముందు దిగదుడుపు. యికదాని ఫస్టు క్లాసుల్నీ, యేసీ క్లాసుల్నీ చూస్తే స్వర్గాన్ని చూడాల్సిన పనేలేదు. రాకెట్టు స్పీడు. జర్నీ అంతా దాన్లోనే చేసుంటే బాగుండును. చేతి నిండా డబ్బు లేకపోతే బతకడమే వేస్టు..." అంటూ యెదుటి సీటులోని యువకుడొకడు గొణుగుతున్నాడు.

యింజనులోంచీ దిగిన డ్రైవరూ, అతడి అసిస్టెంటూ పాతబాటిల్లో నీళ్లు పట్టుకుని తాగుతున్నారు. ఫస్టుక్లాసు కంపార్టుమెంటు దగ్గర సిల్కు చొక్కా యువకుడొకడూ, ఖద్దరు చొక్కా యువకుడొకడూ కోలాలు తాగుతూ పొడవాటి సిగరెట్లు తగలేస్తున్నారు. టీసీ తరమగొట్టడంతో బిక్షగాళ్ల కుటుంబం ప్లాట్‌ఫాం పైకి దిగి అటూ యిటూ బిక్కచూపులు సారిస్తోంది.

రైలు ఆగిపోయి అరగంట దాటింది. ప్లాట్‌ఫాం పైన కొళాయిలో నీళ్లు రావడం ఆగిపోయాయి.. మోటారు వేయడానికి కరెంటు లేదంటూ స్టేషను మాస్టరు కస్సుమంటున్నాడు. తినుబండారాల్ని అమ్మేసిన కుర్రాళ్లు చిల్లర డబ్బుల్ని లెక్కబెట్టుకుంటున్నారు. తినడానికేమీ దొరక్క ప్రయాణీకులు గొల్లుమంటున్నారు.

దూరం నుంచీ యెక్స్‌ప్రెస్ కేక వినిపించింది. అయిదు నిముషాల తర్వాత మొదటి ట్రాకు పైన పెద్ద రైలొకటి వాయు వేగంతో దూసుకెళ్ళిపోయింది.

"చూశారా! మన రైలు కంటే మూడింతలు పెద్దది. కానీ జనం మాత్రం మన రైలులో వున్నందులో మూడో వంతైనా లేరు" అన్నాడు యెదుటి సీటు

యువకుడు.

ప్రయాణీకుల వోపికను మరికాస్సేపు పరీక్షించి చూసిన తర్వాత గ్యాంగ్‌మాన్ డ్రైవరు చేతికి లైన్‌క్లియర్ అందించాడు. గంట మోగింది. గార్డ్ విజిల్ నీరసంగా పలికింది. భిక్షగాళ్ల కుటుంబాన్ని ప్లాట్‌ఫాం పైన వొంటరిగా వొదిలి పెట్టి, రైలు మెల్లగా ముందుకు కదిలింది.

"మొత్తం వున్నదేమో యిరవై ముగ్గురు. కొన్నవేమో పదహారు టిక్కెట్లు. ఫైను కట్టమంటే కట్టరు. దిగమంటే దిగరు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళూ పట్టుకునే రకం. వీళ్ల పప్పులు నా దగ్గర వుడుకుతాయా?" అని గొణుక్కుంటూ మా సీట్ల దగ్గరికొచ్చిన టీసీ మా టికెట్లను పరీక్షించసాగాడు. కళ్లజోడు యువకుడు తమ టికెట్లు చూపెట్టిన తర్వాత టీసీ ఖద్దరువాలా ముందు కొచ్చాడు.

అతను వులకలేదు, పలకలేదు. మెల్లగా గురక పెడుతున్నాడు కూడా!

"యింతసేపూ మేలుకునే వున్నాడండీ!" అన్నాడు కళ్ళద్దాల యువకుడు.

"అలాగా! యెంతదూరంనుంచీ వస్తున్నాడో పాపం! చూడ్డానికి ఫస్టుక్లాసు పాసింజెరు లాగున్నాడు. లేచాకే చెక్ చేస్తానులెండి!" అంటూ టీసీ కుర్రాళ్ల ముందుకు చేయిచాపి "టికెట్" అని హెచ్చరించాడు.

గిరజాల యువకుడూ, బొమ్మలచొక్కా కుర్రాడూ తాత్కాలికంగా తమ మౌనవ్రతాన్ని కాస్సేపు సడలించి "పాస్... పాస్" అన్నారు.

టీసీ దృష్టి కంపార్టుమెంటులో మిగిలిన చివరి వ్యక్తిపైన నిలిచిపోయింది.

"యిప్పుడు చెప్పు... యే స్టేషనులో రైలెక్కావు?" అని అడిగాడు నల్లటి కుర్రాడ్ని.

"పోయిన స్టేషన్లోనే సార్!" అన్నాడు నల్లటి కుర్రాడు జంకుతూ.

బిల్లుపుస్తకం పేజీలు తిప్పుతూ "పోయిన జంక్షను నుంచీ ఫైను కట్టాల్సిందే! మొత్తం నూట ముప్పయి అయిదు రూపాయలు, తీ బయటికి" అని గద్దించాడు.

"సార్సార్! యింకెప్పుడూ టికెట్టు లేకుండా బండెక్కను. యీ తడవ కిడిచిపెట్టేయ్యండి" అంటూ ఆ యువకుడు ప్రాధేయపడసాగాడు.

"యీ హరికథలు నాకొద్దు. నీ పేరు చెప్పు. నీతో మాట్లాడుతూ కూర్చునే తీరిక లేదు నాకు. యిలారా దగ్గరికి. రారా అంటే... దొంగ నాయలా! రా యిలా...!" అంటూ టీసీ ఆ యువకుడి గాడాబనీను జేబులోకి చేయి జొనిపాడు.

అరకట్ట తమలపాకులతో బాటూ కొన్ని పదిరూపాయల నోట్లు కూడా పై కొచ్చాయి.

"సార్సార్! యీ దుడ్డు నాదిగాదు..." టీసీ చేతిలోని డబ్బునతడు లాక్కోబోయాడు.

"మాదర్చేద్! నా చేతిలోంచీ పెరుక్కుంటావా? యెంత ధైర్యంరా నీకు?" టీసీ చేయి నల్లటి కుర్రాడి చెంపపైన తన ముద్రను గాఢంగా ముద్రించింది. ఆ కుర్రాడి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

"ఆడపిల్లలా యేడిస్తే వదిలేస్తాననుకున్నావా? అదేం కుదరదు..." టీసీ గబగబా రాసుకుపోసాగాడు.

బొమ్మల చొక్కా కుర్రాడు "సార్సార్! ప్లీజ్. కొంచెం చూసి రాసుకోండి" అన్నాడు వీలయినంత వినయంగా. "వీడిది మా వూరే! పూటకు గతిలేని సంసారం. చెరువు కింద నేల. కానీ చెరువు నిండదు. పంటలు పండి చాలా రోజులై పోయింది. పంటలకో, మనుషులకో మందులేవో కొనడానికి టౌనుకొస్తు న్నట్లున్నాడు. పాపం! మీ చేతనైనంత సాయం చెయ్యండి..."

"యేదో అతను చెప్పాడు కాబట్టి డెబ్బయి అయిదు రూపాయలకు బిల్లు రాశాను..." అంటూ టీసీ చిల్లర డబ్బులతో బాటూ బిల్లును నల్లటి కుర్రాడి చేతిలోకి బలవంతగా దోపాడు. తమలపాకుల్ని తన బాగ్‌లోకి తోసేశాడు.

"మీరిలా దయాదాక్షిణ్యాల పేరుతో అరాకొరా ఫైనులు వసూలు చేస్తే నష్టం యెవరికి చెప్పండి?" అన్న బులెట్ లాంటి ప్రశ్న కళ్లద్దాల యువకుడి నుంచీ పేలింది.

యిలాంటి ప్రశ్న తననెదుర్కొంటుందని వూహించని టీసీ ముఖం ముడుచుకుపోసాగింది. కళ్లు కుంచించుకుపోసాగాయి. "నిజమేనండీ! రూల్ రూలే! కానీ యీ వుద్యోగంలో యెన్ని సాదక బాదకాలున్నాయో మీకెలా తెలుస్తుంది? రోజుకో డజనుమంది నైనా యేడిపించక తప్పదు మాకు. వాళ్లు మమ్మల్ని యిష్టమొచ్చినట్టల్లా తిట్టుకుంటారు. యెంతయినా భార్యాబిడ్డలున్న వాళ్లం. వాళ్ల వుసురు మాకు తగులుతుందేమోనని మాకు పాపభయం" అన్నాడతను.

"అయినా యిలా ఫైను తగ్గించడం న్యాయం గాదండీ! కావలిస్తే రెండు రోజులు బొక్కలోకి తోయించండి" అన్నాడు కళ్లజోడు యువకుడు వురిమి చూస్తూ.

అతడి మాటలు వినిపించనట్టుగా పైకి లేచి, "చైను లాగారెవరో! పోతే పోనీలే! నేను పక్క కంపార్టుమెంటులోకెళ్ళొచ్చు! యింకా సగం కంపార్టు మెంట్లయినా చెక్ చేయలేదు" అని స్వగతంలా మాట్లాడుకుంటూ గేటు వైపుకెళ్లి పోయాడు టీసీ.

బ్రేకులు పడ్డ రైలు ఆగీ ఆగక ముందే, నాలుగైదు కంపార్టుమెంట్ల కవతలి కంపార్టుమెంటులోంచీ, బిలబిలమంటూ పెద్ద గుంపు కిందికి దుమికింది. మరికాస్సేపటిలో ముసలం పుట్టినట్లుగా వాళ్లు కీచులాడుకోసాగారు. కొందరు పంచెలు పైకెగగట్టి, ట్రాకు పక్కనున్న గులకరాళ్లెత్తి విసురుకోసాగారు. కొన్ని రాళ్లు గాజు తలుపులకు తగిలి, కిటికీల పక్కన కూర్చున్న ప్రయాణీకులకు గాయాలు చేయసాగాయి. కొందరు ప్రయాణీకులు డబ్బా రేకుల షట్టర్లు కిందికి దించి తలుపులు బిడాయించుకొని, తమ కంపార్టుమెంట్లను కోటల్లా మార్చుకోసాగారు. గొడవ మరింతగా పెరగ సాగింది. గావుకేకలు వినబడసాగాయి. రక్తమోడుతున్న వ్యక్తుల శరీరాలను అయిదారుగురు భుజాలకెత్తుకుని మా కంపార్టుమెంటు పక్కలోంచీ యింజను దగ్గరికెళ్తున్నారు.

నాటకాన్ని చూసినంత వుత్కంఠతో అంతా తనివితీరా దర్శించి వచ్చిన బొమ్మల చొక్కా యువకుడు "ఆ పెట్టెనంతా అదేదో కాకర. భీకర భాషల వాళ్లు ఆక్రమించుకుని యింకెవర్నీ లోపలికి రానివ్వకుండా హఠం చేశారట! లోపలికొస్తే వూరుకోమని సవాలు చేశారట! యేం చేస్తారో మేమూ చూస్తామంటూ యిటువైపు మనుషులెవరో లోపలికెళ్లారు. రక్త గాయాలయ్యాయి. మీది తప్పంటే మీదే తప్పంటూ రెండు వర్గాలూ వాదులాడుకుంటున్నాయి. రక్తమోడుతున్న వాళ్లిద్దరూ స్పృహ తప్పారు. వాళ్ల శరీరాల్ని ట్రాకుపైన పడుకోబెట్టి ఆ వర్గంవాళ్ళు ధర్నా చేస్తున్నారు. వాళ్లు చావుబతుకుల మధ్య తన్నుకు చస్తున్నారు. కానీ తమకు న్యాయం జరిగేంతవరకూ రైలును కదలనివ్వమని రెండు వర్గాలూ యింజను ముందే బైటాయించేశాయి. యీ రగడ యిప్పుడిప్పుడే తెగేట్లు లేదు" అన్నాడు పరవశంగా.

"టీసీ యేం చేస్తున్నాడు? రైల్వే పోలీసులెవరూ లేరా? డ్రైవరే మయ్యాడు?" అంటూ కళ్లద్దాల యువకుడి భార్య ఆక్రోశించసాగింది.

కాస్సేపు అందరూ కంగారుపడుతూ రాతి బొమ్మల్లా మౌనంగా వుండి పోయారు.

టీసీ వెళ్ళిపోయాక మా పెట్టెలోకి దాటుకున్న కట్టెల మోపతను రెండు సీట్ల

మధ్యాకూర్చుని, తాపీగా బీడీ దమ్ము లాగుతూ "టికెట్టు లేకుండా బండెక్కి నోడివి. టీసీని చూస్తానే లగెత్తగూడదా?" అని నల్లటి కుర్రాడ్ని ముగ్గులోకి లాగసాగాడు.

"టికెట్టు కొనేదానికి బుకింగాఫీసుకు పొయ్యేలోపల బండొచ్చేసింది! టయిం దొరకలేదు" అన్నాడు నల్లటి కుర్రాడు గుక్కిళ్లు మింగుతూ.

"వొరే పిచ్చోడా! నిన్ను టికెట్టెందుకు కొనలేదని నేనడగాటం లేదు. టీసీని చూడంగానే పక్క పెట్టెలోకి మారిపోయే లగువు తెలియనోడివి, యిక్కడెట్ల బతకతావని నేనడగతా వుండాను" అంటూ కట్టెల మోపతను లా పాయింటు లాగాడు.

"వీడా? వీడేం బతకతాడులే! వొట్టి మూగెద్దు..." అంటూ బొమ్మల చొక్కా కుర్రాడు కలగజేసుకున్నాడు. "అవతల టీసీ పైను రాస్తావుంటే వూరికే గుడ్లల్లో నీళ్లు కక్కుకుంటూ కూర్చున్నాడు. ఆ టీసీ కాళ్లో చేతులో పట్టుకునేది గూడా రాదు. ఆ కాడికీ నేను చెప్పబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే ఆ టీసీ మొత్తమంతా వూడ్చుకోని పోయున్ను..."

"మా దగ్గర పాస్‌లున్నాయనా నీ వుద్దేశం?" గిరజాల కుర్రాడు కళ్లద్దాల యువకుడికేసి అదోలా చూస్తూ పకపకా నవ్వేశాడు. "స్పెషల్ స్క్వాడ్ యెప్పుడో గానీ రాదు. అయినా మన దుడ్డుతో పాసెందుకు కొనాల? దానితో చానా పన్లున్నాయి గదా! పాస్ అని చెప్పినాక గూడా స్టూడెంట్లని పాస్ చూపించమనే ధమ్ము లెవరికుండాయి?"

ఖద్దరువాలా పక్కనున్న వ్యక్తి "నా దగ్గరుండే టికెట్టు యీ పొద్దు కొనింది గాదు. వారం దినాలకు ముందు కొనింది. టీసీకి డేటు చూసే తీరిక లేకపోయ..." అంటూ కళ్లెగరేశాడు.

కళ్లద్దాల యువకుడి ముఖంలో రంగులు మారసాగాయి. అతడి నుదుటి పైన చెమట బిందువులు పుట్టుకొచ్చాయి.

యింతలో గిరజాల కుర్రాడు గసబోసుకుంటూ వచ్చి "అడ్డంగా వుండే శరీరాల నెత్తి రైల్లో కెక్కించమంటే వాళ్లు వినడం లేదు. తొందరగా ఆస్పత్రికి తీసుకెళ్లకపోతే వాళ్లకు ప్రమాదమని చెప్తున్నా వాళ్ల నెత్తికెక్కడం లేదు... మంచి మాట చెప్పేదానికి పోతే మన వాళ్లను కొట్టను కొట్టనూ వస్తున్నారు..." అన్నాడు.

"మనమంతా యూనిటీగా వుంటే వాళ్లేం చేస్తార్రా? అటోయిటో తేల్చుకుందాం పదండి" వుద్రేకంతోనూ, ఆవేశంతోనూ వూగిపోతూ పైకి లేచాడు

బొమ్మల చొక్కా కుర్రాడు.

గిరజాల కుర్రాడు లోపలకొచ్చి కూర్చుంటూ, "మనల్ని యీ మిషపైన బయటికి రప్పించి గొడవ పెట్టుకోవాలనీ, ఆ సందులో మన పెట్టెలోకెక్కి మన చోటు నాక్రమించుకోవాలనీ వాళ్ల యెత్తు. యెవరో అనుకుంటూ వుంటే నేను విన్నేశాను. కాబట్టి అక్కడికెళ్లొద్దు. యిక్కడే కూచుందాం. యెవరైనా యిక్కడికొచ్చి అల్లరిపెడితే మాత్రం వూరుకోగూడదు..." అన్నాడు.

"కొంచెం ముందుకూ వెనక్కూ చూసుకుంటా, కళ్లు తెరుసుకోని, సులువు తెలుసుకోని, బతికేది నేర్చుకుంటే చాలు! యెట్లయినా యీ బండిలోనే బతికిపోవచ్చు సామీ!" మరో బీడీని రగిలిస్తూ కట్టెల మోపతను తన పాత టాపిక్‌నే కొనసాగించాడు. "యెప్పుడో మా అయ్య పాము కరిచి చచ్చిపోయి నప్పుటి నుంచీ యీ మాదిరిగా కట్టెలు తెచ్చి అమ్ముకునే పని చేస్తా వుండాను. టికెట్టెట్టుంటాదో నాకు తెలవదు. యే మాట కామాటే చెప్పాల! కలిగ్గంలో ధర్మానికెప్పుడూ వొక పాదమే! వొక్కోసారి మిడిమాళం టీసీలూ, గార్డులూ వస్తారు. వాళ్ల పోరు పడలేం. దించెయ్యమంటే దించెయ్యమంటారు. కొందురు మహాన్నభావులు. రెండో మూడో చేతిలో పెడితే చూసీ చూడకుండా పోతారు..."

ఖద్దరువాలా గూడా పొడవాటి చుట్టను వెలిగించి చిన్మ్రుద్రతో, "బతికితే కోయిల మాదిరిగా బతకాల. కాకి బతుకూ బతుకేనా ? నేను రైలెక్కినాక యిద్దురు టీసీలొచ్చినారు. నేను కళ్ళుమూసుకుంటే యింక నన్ను లేపి టికెట్టడిగే ధైర్యం యెవరికుండాది? అంతా గుడ్డల్లో వుంది మహత్యం" అంటూ ధర్మోపదేశం చేశాడు.

"అప్పుటికి నీ బతుకెంతో మేలు! టీసీ వొకడే నీకు యముడు. నా పాలిటికి ఫారెస్టు గార్డులు గూడా వుంటారు. అయినా అబ్బోడా! బండి వాళ్లసోత్తేమీ గాదు. యిది మనందరిదీ. టికెట్టు లేకుండానే బండెక్కు. అవుతే టీసీ చేతికి దొరక్కుండా తప్పించుకునే లగువు నేర్చుకో!" అన్నాడు కట్టెల మోపతను అర మోడ్పు కళ్లతో.

"యీ పొద్దు అనవసరంగా దుడ్డు పోగొట్టుకుంటివే! టీసీ నిన్నిక్కడ విడిచి పెట్టి పోయినప్పుడు నీ దగ్గిరుండే దుడ్డంతా నా దగ్గిరిచ్చేసి వుండగూడదా? డబ్బుల్లేవని తెలిసినాక టీసీ మాత్రం యేం చేస్తాడు?" అన్నాడు బొమ్మల చొక్కా కుర్రాడు.

"అదిగాదు. నేనో మాట చెప్తాను విను..." అంటూ కళ్లజోడు యువకుడు

తానూ గొంతు సవరించుకున్నాడు. అతడేం చెబుతాడో వినడానికి నేనూ చెవులు రిక్కించాను. "టీసీ ఫైను కట్టమన్నాడే అనుకో! బలవంతంగా నీ డబ్బు నువ్వు లాక్కుని, తిరగబడలేకపోయావా? ఫైల్వాను లాగున్నావే! ఆ టీసీని వొక పట్టుపట్టి చూడలేకపోయినావు గదా!" అన్నాడతను.

నేను వులిక్కిపడ్డాను. చాలా సేపటినుంచీ గోడమీది పిల్లిలా తారట్లాడుతున్న కళ్లజోడు యువకుడు మెజారిటీ వైపుకు దూకేశాడు.

ప్రయాణానికి తలపెట్టుకున్న సమయమూ, వాతావరణమూ అనుకూలంగా లేవని నాకు తెలుసు. అరిగిన చక్రాలతో, పాతబడిన పెట్టెలతో, మూలుగుతున్న యింజనుతో యీ పాసింజరు రైలు పట్టబలవంతాన నడుస్తోందనీ తెలుసు. కానీ దారిలో యెదురయ్యే మెకానికల్ సమస్యల్ని సరిదిద్దగల వాళ్లుంటారు లెమ్మన్న ధైర్యం నాకుండేది. ప్రవాహానికెదురీద గలిగేవాళ్లు కొందరైనా వుంటారనీ, దేనికీ తలవంచకుండా స్థిర చిత్తంతో వాళ్ళు నిలబడతారనీ నమ్మేవాణ్ణి! కానీ నా ధైర్యం సన్నగిల్లసాగింది.

అర్థాంతరంగా అడ్డం వచ్చిన యీ గొడవ యెప్పటికైనా తెగుతుందా? అసలీ రైలు ముందుకు నడుస్తుందా? యే యెక్స్‌ప్రెస్ రైలుకో అడ్డమని భావించి, యే లూప్ లైన్లోనో తోసేస్తారా? అసలిది సంతోషాబాద్ చేరుతుందా?

నేను నిస్సహాయంగా కళ్లజోడు యువకుడికేసి చూశాను.

నా జేబులోని యింటర్వ్యూ కాగితం ముల్లులా నా గుండె పైన గుచ్చుతోంది. సమయానికి నేను యింటర్వ్యూనందుకోగలనా?

*(నవంబర్ 1998, రచన ఇంటింటి పత్రిక)*

❖ ❖ ❖